సాక్షి
ములుగు
ఆదివారం | 26 | నవంబర్ | 2023



గోదావరికి హారతి

కార్తీమాసం పంచరత్నాల్లో భాగంగా కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ చతుర్దశిని పురస్కరించుకొని గోదావరి నదికి పంచహారతి నిర్వహించారు. - 6లో



ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు కేయూ జట్లు - 6లో

సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ టోర్నమెంట్‌కు కేయూ జట్లను ఎంపిక చేసినట్లు ఆచార్య శ్రీనివాస్‌రావు తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0° /22.0°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్న సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి పొగమంచుతో పాటు చలితీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

రాజ్యాంగం ప్రజలకు, ప్రభుత్వానికి కరదీపిక



వెంకటాపురం(ఎం): భారత రాజ్యాంగం దేశానికి, ప్రజలకు, ప్రభుత్వానికి కరదీపిక లాంటిదని ములుగు సీనియర్ సివిల్ జడ్జి టి.మాధవి అన్నారు. జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని జవహర్‌నగర్ కస్తూరిబా విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జడ్జి మాధవి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. రాజ్యాంగం, చట్టాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌఖ్య, ములుగు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.వేణుగోపాలచారి, న్యాయవాది మేకల మహేందర్, కస్తూర్బా విద్యాలయాల స్పెషల్ ఆఫీసర్ సరిత, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంజీవ, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ములుగు : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీలో చేరినట్లు మాజీ మంత్రి జగన్నాయక్ అన్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో మాజీ మంత్రి జగన్నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌లు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇరువురికి రేవంత్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఆర్ గార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి జగన్నాయక్, బాదం ప్రవీణ్‌లు మాట్లాడారు. ఎమ్మెల్యే సీతక్క గెలుపునకు తాము శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మంగపేట: రైతులు పండించిన పంటను స్థానికంగా విక్రయించి మద్దతు ధర పొందేందుకు డీఆర్‌డీఏ(సెర్ప్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ బాలస్వామి అన్నారు. మండల పరిధిలోని కమలాపురం, చెరుపల్లి, గంపోనిగూడెం, తిమ్మంపేట, రమణక్కపేట, మల్లూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం బాలస్వామి ప్రారంభించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గ్రేడు ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,203, సాధారణ రకం క్వింటాకు రూ.2,183 పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అప్పారావు, ఆయా సెంటర్ల సీసీలు, స్థానిక రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుమ్మడి సోమయ్య, చింతా పున్నారావు సిద్ధంశెట్టి శ్రీనివాస్, నర్సింహారావు, భగవాన్‌రెడ్డి, ఆయా సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ సాధించడమే లక్ష్యం



ఏటూరునాగారం: ప్రపంచస్థాయి కరాటే పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించడమే లక్ష్యంగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని భారత జట్టు కరాటే కోచ్ అబ్బు మాస్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు మండల కేంద్రానికి చెందిన భారత జట్టు కరాటే కోచ్ అబ్బు మాస్టర్ నేతృత్వంలోని పునకోసి షోటోకాన్ కరాటే అసోసియేషన్ పోటీలకు 10మంది క్రీడాకారులు కజకిస్తాన్ దేశంలోని ఆస్తానకు చేరుకున్నట్లు వివరించారు. నేడు ఫైనల్ స్థాయి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

మోసపోయి.. గోస పడొద్దు



పాలకుర్తిలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం



అభివాదం చేస్తున్న హరీశ్‌రావు, పక్కన మంత్రి, అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు

భవిష్యత్ ఆలోచించి ఓటు వేయండి

- 'రిస్క్ వద్దు.. కారుకు గుద్దు' నినాదంతో ముందుకెళ్లండి
- కాంగ్రెస్, బీజేపీ సభల్లో అన్నీ ఖాళీ కుర్చీలు
- ఎర్రబెల్లి గెలిస్తే పవర్‌ఫుల్ మంత్రి అవుతడు
- మానుకోట, నెక్కొండ, పాలకుర్తి, బచ్చన్నపేట రోడ్‌షోలు, కార్నర్ మీటింగుల్లో మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మహబూబాబాద్/నెక్కొండ/పాలకుర్తి/పాలకుర్తి టౌన్/బచ్చన్నపేట : ఆరు గ్యారంటీలతో మాయమాటలు చెప్పి ఓట్లు అడిగేందుకు వస్తున్న కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయి వచ్చే ఐదేళ్లు గోస పడొద్దని, ఆలోచించి ఓటు వేయాలని రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 'రిస్క్ వద్దు.. కారుకు గుద్దు' అనే నినాదంతో ముందుకు పోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మహబూబాబాద్, నెక్కొండ, పాలకుర్తి, బచ్చన్నపేటలో ఆయా నియోజకవర్గాల బీఆర్‌ఎస్ అభ్యర్థులు శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోరుతూ.. శనివారం నిర్వహించిన రోడ్‌షోలు, కార్నర్‌మీటింగ్‌లలో మంత్రి హరీశ్‌రావు ప్రసంగించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని చెప్పారు. కాంగ్రెస్ సభల్లో ఖాళీ కుర్చీలు కనిపిస్తున్నాయని, ఆ కుర్చీలకు ఉపన్యాసాలు ఇస్తున్నారని, బీఆర్‌ఎస్ సభకు పెద్దఎత్తున జనం వస్తున్నారన్నారు. భవిష్యత్ ఆలోచించే నాయకుడు కేసీఆర్ కావాలో, బూతులు మాట్లాడే రేవంత్‌రెడ్డి కావాలో ప్రజలే ఆలోచించి ఓట్లు వేయాలన్నారు. రైతుబంధు ఆపాలని కాంగ్రెస్ కుట్ర చేసిందని, కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అనుమతి ఇచ్చిందని, రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ కానుందని పేర్కొన్నారు. మార్పు కోసం తమకు ఓటు వేయాలంటున్న కాంగ్రెస్.. 24 గంటల కరెంట్‌కు మూడు గంటల కరెంటేనా? అని ధ్వజమెత్తారు. భూమి ఎంత ఉన్నా.. రైతుకు రూ.15 వేలు మాత్రమే ఇస్తామని చెబుతున్నారని, తాము ఎకరాకు రూ.16 వేలు ఇస్తామని మంత్రి తెలిపారు. రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్లు.. ఇలా అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక వివిధ పథకాలు పక్కాగా అమలవుతాయని స్పష్టం చేశారు. కేసీఆర్‌ను ఓడించడానికి కాంగ్రెస్, బీజేపీ కుట్రలు చేస్తున్నాయన్నారు. ప్రియాంకగాంధీ ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే రెండే సీట్లు వచ్చాయని గుర్తు చేశారు. నెక్కొండలో సివిల్ ఆస్పత్రి ఏర్పాటు, అలాగే నెక్కొండను మున్సిపాలిటీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

బచ్చన్నపేటలో రెండు నెలలు పనిచేశా..

20 ఏళ్ల క్రితం తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో బచ్చన్నపేటలో రెండు నెలలు పనిచేశానని, అప్పుడు వ్యవసాయానికి సరిపడా కరెంటు లేక రాత్రి పూట రైతులు బావుల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడేవారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. మహిళలు తాగునీటిని చాలా దూరం వెళ్లి తెచ్చుకునేవారని, ఈ ప్రాంత పరిస్థితులను చూసిన సీఎం కేసీఆర్ కన్నీళ్లు పెట్టుకున్న ఘటనలున్నాయని పేర్కొన్నారు. కరువుతో అల్లాడిన ఈ ప్రాంతం ఇప్పుడు గోదావరి జలాలతో కళకళలాడుతోందన్నారు. ఒకనాడు చేయడానికి పనులు లేక స్థానికులు జీవనోపాధికి వలస వెళ్లారని, నేడు వ్యవసాయ పనులకు కూలీలు దొరక్క బిహార్ నుంచి తెప్పించుకునే స్థాయికి వచ్చామన్నారు. ప్రతిపక్షాలు చెప్పే మాయమాటలు నమ్మొద్దని, అభివృద్ధిని కాంక్షించే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



నెక్కొండ రోడ్‌షోలో అభివాదం చేస్తున్న హరీశ్, పెద్ది



మానుకోట రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు, అభ్యర్థి శంకర్‌నాయక్

ఎలక్షన్లు ఉన్నా లేకున్నా.. కష్టమొచ్చినా.. ఆపతిసంపతికి స్పందించే.. అందరి నోట్లో నాలుకలా ఉండే దయన్న గెలవాలా.. అమెరికా నుంచి నోట్ల కట్టలతో వచ్చిన ఎన్‌ఆర్‌ఐ గెలవాలా.. అని ప్రజలను అడిగారు. కరోనా వచ్చినప్పుడు నా దగ్గరికి వచ్చి ప్రత్యేక కోటాలో మందులు తెచ్చుకుని మిమ్మల్ని కాపాడుకున్న దయన్న.. ఏ ఊరుకెళ్లినా సీసీ రోడ్లు వేసి మట్టి అంటకుండా చేయలేదా? అని ప్రజలను అడిగారు. దయాకర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే పాలకుర్తి రూపురేఖలు మరింత మారుతాయి. సీనియర్ మంత్రి అయితడు. పవర్‌ఫుల్‌గా ఉండాలంటే పాలకుర్తిలో గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. ఆయా సభల్లో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ స్టేట్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రావు, వరంగల్ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, మానుకోట జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్, భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ ఎత్తుగడలు సాగవు :



పెద్ది సుదర్శన్‌రెడ్డి, నర్సంపేట

మాజీ ఎమ్మెల్యేలు దొంతి మాధవ రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఒక్కటై తనను ఓడించాలని చూస్తున్నారని పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఇదేం కొత్త కాదని 2014లో ఇండిపెండెంట్ డ్రామాలాడి తనను ఓడించారని, 2018లో మరోసారి నర్సంపేటలో దొంతి, మరోచోట రేవూరి ఎన్నికల్లో పోటీ చేసిన విషయాన్ని పెద్ది గుర్తు చేశారు. తిరిగి ఇద్దరు వేర్వేరు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారని, వారి ఎత్తుగడలు నర్సంపేటలో సాగవని, నియోజకవర్గ ప్రజలు అండగా నిలిచి గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

అభివృద్ధికి పట్టం కట్టండి :



పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ

జనగామ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే నాయకుడికి పట్టం కట్టాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే పాలేరుగా పనిచేస్తానన్నారు. 30వ తేదీ ఎన్నికల్లో అందరూ కారు గుర్తుకు ఓటు వేసి, బీఆర్‌ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు.

నలభై ఏళ్లలో ఎన్నో చేశా :



ఎర్రబెల్లి దయాకర్‌రావు, పాలకుర్తి

నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను.. మరోసారి తనకు అవకాశం కల్పించాలని పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సాగు, తాగు నీరు, రోడ్ల అభివృద్ధి, ఇళ్ల నిర్మాణాలు, విద్య వంటి వసతులు కల్పించానన్నారు. వల్మిడి, బమ్మెర, పాలకుర్తి గ్రామాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేశానని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయాలి :



శంకర్‌నాయక్, మహబూబాబాద్

మానుకోట నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్ నాయక్ తెలిపారు. మానుకోట గడ్డపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేసి మూడో సారి కేసీఆర్‌ను సీఎం చేయాలన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటుతోపాటు విద్య, వైద్యపరంగా ఎంతో అభివృద్ధి చేశామన్నారు. మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

రామప్పలో పర్యాటకుల సందడి



రామలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న పర్యాటకులు



నంది విగ్రహం వద్ద జర్మనీ దేశస్తులు

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయంలో శనివారం పర్యాటకులు, విద్యార్థులతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు, విద్యార్థులు అధికసంఖ్యలో తరలివచ్చి రామప్ప రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. విద్యార్థులు నంది విగ్రహం వద్ద, ఆలయ శిల్పాల వద్ద ఫొటోలు దిగుతూ ఆనందం వ్యక్తం చేశారు.

జర్మనీ దేశస్తుల రాక

రామప్ప దేవాలయాన్ని జర్మనీకి చెందిన అలెక్స్ రాస్కా, సెబాస్టియన్, మార్కిన్‌లు సందర్శించారు. రామప్ప ఆలయ విశిష్టతను గైడ్ గోరంటల విజయ్‌కుమార్ ద్వారా తెలుసుకొని రామప్ప వండర్‌ఫుల్ టెంపుల్ అని కొనియాడారు. నంది విగ్రహం వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

తెలంగాణలో నియంత పాలన

నిరుద్యోగ ఆత్మీయ సమ్మేళనంలో టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం

ములుగు: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పదేళ్లుగా నియంత పాలన కొనసాగుతోందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని డీలర్ ఫంక్షన్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన నిరుద్యోగ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సెక్షన్ 30, 144 లతో ప్రజలు నిరసన చేయకుండా చేశారని తెలిపారు. ప్రజల తరఫున పోరాటం చేసే వారిని గ్రామాలకు వెళ్లనీయకుండా అరెస్టులు చేశారని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ఎదురించి ప్రశ్నిస్తే అసహనంతో కేసులు పెట్టారన్నారు. అధికార పార్టీ నాయకులు కావాలని తమ ఫోన్లు ట్యాప్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇసుక దందాలు, భూ సెటిల్ మెంట్లతో వారి ఆగడాలకు అంతే లేకుండా పోతుందన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులు విధ్వంసం చేస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లాలో అటవీ భూములు దున్నుకొని వ్యవసాయం చేసేవారికి హక్కులు కల్పించాలని పోరాటం చేశామని గుర్తు చేశారు. అఖిల పక్షం డిమాండ్‌తో 2005 అటవీ హక్కుల చట్టం వచ్చిందన్నారు. పాలకులు అప్రజాస్వామికంగా వ్యవహరించి అడవి బిడ్డలను కొట్టిన సంఘటనలు ఉన్నాయన్నారు. మహిళలను కోర్టులకు ఈడ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి సీతక్కను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కూచన రవళిరెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి గౌడ్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, రవీందర్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు అజయ్ నాయక్, దీపక్ మిశ్రా

ములుగు: ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల ప్రత్యేక సాధారణ పరిశీలకులు అజయ్ నాయక్, పోలీస్ ప్రత్యేక పరిశీలకులు దీపక్ మిశ్రా సూచించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి, ఎస్పీ గాష్‌ఆలం, రిటర్నింగ్ అధికారి అంకిత్‌లతో కలిసి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తూ నడుచుకోవాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పటిష్ట బందోబస్తు పకడ్బందీ ఏర్పాట్లతో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలన్నారు. ములుగు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉన్నామని కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇప్పటి వరకు రూ.9,18,900 సీజ్ చేశామన్నారు. పోలింగ్ కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్పష్టం చేశారు. ఈవీఎంల కమీషనింగ్ చేసి పోలింగ్‌కు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించిన ఇద్దరిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామన్నారు. ఎఫ్‌ఎస్ఐఎస్ఎస్‌జీ, వీఎస్టీ బృందాల నిర్వహణపై వివరించారు. ఎన్నికల కంట్రోల్ రూమ్‌లకు సంబంధించిన 457 ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. సీ-విజిల్ ద్వారా అందిన 87 ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకున్నామని వివరించారు. సువిధా ద్వారా 442 అనుమతులు ఇచ్చామని ఇతర ఎన్నికల అంశాలపై కలెక్టర్ వివరించారు. 94 శాతం ఓటర్లకు స్లిప్పులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ గాష్‌ఆలం మాట్లాడుతూ ములుగు నియోజకవర్గంలో 98 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు, 37 పోలింగ్ లొకేషన్‌లో ఉన్నాయని, అధిక బలగాలతో ఆయా ప్రాంతాల్లో పోలింగ్ సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు సవిన్ బన్సల్, ఎన్నికల పోలీస్ పర్యవేక్షకులు అంజన్ చక్రబోర్తి, ఎన్నికల వ్యయ పరిశీలకులు వాగీష్ కుమార్ సింగ్ లతో సమావేశమై జిల్లాలో ఎన్నికల నిర్వహణపై చర్చించారు. అంతకు ముందు జిల్లాకు వచ్చిన ప్రత్యేక సాధారణ పోలీస్ పరిశీలకులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీఓ కె.సత్యపాల్ రెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

నేడు అమిత్‌షా రాక



ములుగు : ములుగు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్ తరఫున ప్రచారం నిర్వహించడానికి నేడు(ఆదివారం) మధ్యాహ్నం 1.30 గంటలకు జిల్లా కేంద్రానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రానున్నారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్‌తో కలిసి శనివారం జిల్లా కేంద్రంలోని సాధన స్కూల్ వద్ద నిర్వహించనున్న సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా జిల్లాకు రానున్నారని తెలిపారు. కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

ఎన్నికల సాధారణ పరిశీలకుడు రత్నాకర్ ఝా

ఏటూరునాగారం: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలని ఎన్నికల సాధారణ రాష్ట్ర పరిశీలకులు రత్నాకర్ ఝా అన్నారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను స్థానిక అధికారులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను రత్నాకర్ ఝా పరిశీలించారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో ఎంత మంది ఓటర్లు ఉన్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులు, వృద్ధులతో ఎన్ని ఓట్లు వేయించారని పీఎస్ 45 బీఎల్‌ఓ లలితను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యుత్, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వృద్ధులు సులభంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లేందుకు ర్యాంపులు ఉండాలన్నారు. అదే విధంగా నీడ ఉండేవిధంగా ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి వసతి కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది సైతం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అంతేకాకుండా ఓటర్ స్లిప్పులు ఎంత మేరకు పంపిణీ చేశారని ప్రశ్నించగా పూర్తి స్థాయిలో ఓటర్లకు అందజేశామని వివరించారు. ఓటు హక్కును అందరూ వినియోగించుకునేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆయన వెంట ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, తహసీల్దార్ సృజన్, ఎంపీడీఓ కుమార్, ఎంఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీఎల్‌ఓ లలితను ప్రశ్నిస్తున్న రత్నాకర్ ఝా

హోం ఓటింగ్ 146.. ఉద్యోగులు 171

ములుగు: ములుగు నియోజకవర్గంలో హోం ఓటింగ్ ద్వారా 146 మంది, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు 171మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ఫారం 12డి కింద దివ్యాంగులు, వృద్ధులు మొత్తం 152 మంది దరఖాస్తు చేసుకోగా వారికి పోస్టల్ బ్యాలెట్ మంజూరు చేశారు. ఇందులో 146 మంది ఇంటి వద్దనే ఉండి తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా జిల్లాలోని ములుగు నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలింగ్ అధికారులకు, ఇతర పోలింగ్ అధికారులకు ములుగులోని బాలికల జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో 17 నియోజక వర్గాలకు సంబంధించిన 171 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు కలెక్టర్ వివరించారు.



పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న ఉద్యోగి

పోలీసుల విస్తృత తనిఖీలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద వాహనాలను శనివారం ఎన్నికల ప్రత్యేక సిబ్బంది, పోలీసులు తనిఖీ చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టే సామగ్రి, నగదు, ఇతర వస్తువులు తరలిపోకుండా తనిఖీలను చేస్తున్నారు. వచ్చిపోయే వాహనాలను పరిశీలిస్తూ వారి వివరాలను, వాహన నంబర్లను నమోదు చేసుకుంటున్నారు. ఎన్నికలకు మరో ఐదు రోజులే సమయం ఉండడంతో వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో సిబ్బంది రెయింబవళ్లు తనిఖీలను మరింత ముమ్మరం చేశారు.



సమన్వయం, సమాచారలోపం

- గూడూరులో ల్యాండ్ అయిన హరీష్‌రావు హెలికాప్టర్
- రోడ్‌షో రద్దు విషయం అప్‌డేట్ చేయని పీఏ
- పీఏపై ఆగ్రహం.. ఎవరూ లేకపోవడంతో అసంతృప్తి..
- అక్కడినుంచి కారులో మహబూబాబాద్‌కు పయనం


గూడూరులో హెలికాప్టర్ ఆగాక ఇది ఏ ఊరు అని అడుగుతున్న మంత్రి హరీష్‌రావు

గూడూరు/మహబూబాబాద్: మంత్రి హరీశ్‌రావు మహబూబాబాద్ జిల్లా పర్యటనలో సమన్వయం, సమాచారలోపం నెలకొంది. మహబూబాబాద్ జిల్లా మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్ గెలుపు కోసం ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు రోడ్‌షోలో పాల్గొనాల్సి ఉంది. అయితే దీనిని రద్దు చేశారు. కానీ విషయం తెలియక శనివారం ఉదయం 11.50 గంటలకు స్థానిక విశాల ప్రదేశంలో ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వచ్చిన హెలికాప్టర్ ల్యాండ్ అయింది. హెలికాప్టర్ పూర్తిగా ఆగాక, అక్కడ ఎవరూ కనిపించకపోవడంతో మంత్రి అవాక్కయ్యారు. హెలికాప్టర్ శబ్దం విన్న కొంతమంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ఒక కానిస్టేబుల్ చేరుకున్నారు. మంత్రి హరీష్‌రావు అక్కడికి వచ్చిన కార్యకర్తను ఇది ఏ ఊరు అని అడిగారు. గూడూరు అనడంతో ఇక్కడ రోడ్ షో అన్నారు కదా.. అంటూ పీఏను అడిగారు. పీఏ కూడా ప్రోగ్రాం అప్‌డేట్ చేయకపోవడంతో మంత్రి ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతలో ఓ కార్యకర్త రాష్ట్ర నాయకుడు భీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డికి ఫోన్ కల్పి ఇవ్వడంతో గూడూరులో ప్రోగ్రాం రద్దయిన విషయం చెబుతూ, సమాచార సమన్వయ లోపం జరిగిందన్నారు. అంతలోనే ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్ కుమారుడు కారులో రాగా, ఆయన కారులో బయలుదేరి అసంతృప్తిగా వెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. అరగంట తరువాత హెలికాప్టర్ కూడా మానుకోటకు వెళ్లింది.

గందరగోళం..

మానుకోటలో రోడ్‌షో రూట్ మ్యాప్ సమాచారం కూడా స్పష్టంగా తెలియకపోవడంతో కొంత గందరగోళం నెలకొంది. దీంతో నర్సంపేట రోడ్డులో, పలు సెంటర్లలో కార్యకర్తలు ఉండిపోయారు. ఆ మార్గాల గుండా రోడ్డుషో సాగలేదు. ముఖ్య నాయకులు ఆ సెంటర్లలో ఉన్న వారిని తహసీల్దార్ కార్యాలయం ఎదుటకు తీసుకొచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు మార్గాల నుంచి కార్యకర్తలు చివరికి తహసీల్దార్ కార్యాలయం ఎదుటకు చేరుకున్నారు.

వలస ఓటర్లపై నాయకుల గురి

- రాను పోనూ ఖర్చులు భరిస్తామంటున్న నేతలు



ఖిలా వరంగల్: ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే. ఒక్క ఓటుతోనే ఓడిన, గెలిచిన సందర్భాలు అనేకమున్నాయి. ఈక్రమంలో సమయం దగ్గర పడితుంటే రాజకీయ నేతలతోపాటు, జనాల్లో ఉత్కంఠ పెరిగింది. అందుకే వలస ఓటర్లపై పలు పార్టీల అభ్యర్థులు గురిపెట్టారు. ఓ వైపు ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం హోరా హోరీగా సాగుతుండగా.. మరో వైపు వలస ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. నగరం నుంచి గ్రామాల వరకు ప్రజలు బతుకు దెరువు కోసం రాష్ట్ర రాజధానితోపాటు ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగ, ఉపాధి పొందుతున్నారు. ఈ వలస ఓటర్లపై రాజకీయ పార్టీల కన్ను పడింది. ఎలాగైనా వారిని రప్పించి తమకు అనుకూలంగా ఓటు మలుచుకునేందుకు పార్టీల నాయకులు శ్రీకారం చుట్టారు. తమ పరిధిలో ఉన్న ఓటర్లు ఎక్కడున్నా సరే రప్పించి ఓట్లు వేయించుకుంటే తమ అభ్యర్థికి మెజార్టీ పెరుగుతుందనే కోణంలో వలస ఓట్లపై దృష్టి సారిస్తున్నారు. రాను పోనూ ఖర్చులు మావే ఆపై రోజంతా ఖర్చు మాదే నంటూ ఫోన్లల్లో ఎరవేస్తున్నారు. ఇక్కడి బంధువులు, కుటుంబ సభ్యుల ద్వారా వారి ఫోన్ నంబర్లు, సమాచారం సేకరించే పనిలో పడ్డారు ఆయా పార్టీల నాయకులు. వారితో మాట్లాడటమే కాకుండా పోలింగ్ రోజున వచ్చి తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతున్నారు. అంతేకాదండోయ్ పైగా ఆయా ఫోన్ నంబర్లకు ఫోన్‌పే, గూగుల్ పే ఉందా..? అంటూ ఆరా తీస్తున్నట్లు సమాచారం. పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో ప్రతి ఓటు ముఖ్యమైనదే కావడం వల్ల ముందే పనిలో పనిగా డబ్బులు సైతం చెల్లిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగ, ఉపాధి పనుల నిమిత్తం ఓటర్లు ఎక్కువగా హైదరాబాద్, భీమండి, సూరత్ లాంటి నగరాలకు వలస వెళ్లారు. వారికి ఫోన్ చేసి మామ, అన్న, బావ, అక్కా, చెల్లి అంటూ వరుసలతో పలకరిస్తూ వారిని ఆకట్టుకునే పనిలో పడ్డారు. తామే ముందుగా పలకరించి ఓటు వేయడానికి రమ్మనడంతోపాటు తీరా ఖర్చులన్నీ అందిస్తే ఆ ఓటు తమకే పక్కా పడుతుందని నాయకులు విశ్వసిస్తున్నారు. ఇదిలా ఉంటే.. జిల్లా నుంచి రాష్ట్ర రాజధానితోపాటు ఇతర రాష్ట్రాలకు వలస పోయిన వారికి ఫోన్లు చేస్తూ సమాచారం అందించే పనిలో నిమగ్నమయ్యారు. తమ గుర్తింపు కార్డుల క్రమ సంఖ్య చెప్పడం లాంటి పనులతో ద్వితీయ శ్రేణి నాయకులతో పాటు కార్యకర్తలు ఓటు వేటలో పడ్డట్లు తెలుస్తోంది.

హలో.. మన నియోజకవర్గంలో ఎలా ఉంది?

వరంగల్ అర్బన్: ఉమ్మడి జిల్లాకు చెందిన అనేకమంది ఇతర ప్రాంతాల్లో ఉపాధిపొందుతూ జీవిస్తున్నారు. ఈక్రమంలో వచ్చిన ప్రస్తుతం తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు హలో.. మన నియోజకవర్గంలో ఏ పార్టీ, ఏ అభ్యర్థి గెలిచే అవకాశాలు ఉన్నాయి.. అంటూ ఇక్కడి తమ బంధువులు, స్నేహితులు, పరిచయస్తులను ఆరా తీస్తున్నారు. ఎన్నికల అభ్యర్థులు ఖరారైననాటి నుంచి దూర ప్రాంతాల్లో, దేశ, విదేశాల్లో ఉన్నవారు ఇక్కడి విషయాలను ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. తమకు నచ్చిన పార్టీ, అభ్యర్థి కోసం అమితాసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో అనుకూలంగా ఫలానా వారికి ఓటు వేయాలని, మనోళ్లందరికీ చెప్పాలని చెబుతున్నారు. దీంతో నామినేషన్ల దగ్గరి నుంచి ప్రచారం, పోలింగ్ వరకు వీరంతా ఎన్నికలను పరిశీలిస్తూ టీవీల్లో, సోషల్ మీడియాలో ఎన్నికల వివరాలను తెలుసుకునే పనిలో ఉన్నారు.

'కోడ్' ఉల్లంఘనపై కేసు నమోదు

రామన్నపేట: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మండి బజార్ కౌసర్ మసీదు ఎదుట ప్రచారం చేసిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలపై మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో వేర్వేరుగా కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎఫ్.ఎస్.టీ టీం ఇన్‌చార్జ్ ప్రవీణ్ ఫిర్యాదు మేరకు శనివారం మధ్యాహ్నం బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నన్నపునేని నరేందర్ అనుచరులైన కార్పొరేటర్ పుర్కాన్, బీఆర్‌ఎస్ నేతలు మసూద్, సురేష్, దుబ్బా శ్రీనివాస్, రబ్బానీతోపాటు మరికొంతమంది వ్యక్తుల మీద కేసు నమోదు కాగా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండా సురేఖ అనుచరులు సుస్మిత పటేల్, వసీం, అన్వర్, యాకూబ్ అలీపై కేసు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు కేయూ జట్లు


రెజ్లింగ్ కేయూ పురుషుల జట్టుతో స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ శ్రీనివాస్‌రావు


కేయూ మహిళల జట్టుతో శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్ : పంజాబ్ రాష్ట్రం మొహాలిలోని చండీఘర్ యూనివర్సిటీలో ఈనెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించనున్న సౌత్‌వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు శనివారం కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య శ్రీనివాస్‌రావు తెలిపారు. రెజ్లింగ్ ఫ్రీ స్టైయిల్ పురుషుల జట్టులో వి.భరత్, ఎన్.కార్తీక్ (న్యూసైన్స్ డిగ్రీ కళాశాల, హనుమకొండ), బి.అఖిల్ (ఎల్‌బీ కాలేజి వరంగల్), ఎస్.నితిన్, బి.అఖిల్ (కేడీసీ హనుమకొండ), ఎ.భాను ప్రకాశ్ (ఐటీడబ్ల్యూ ఆర్‌డీసీ మణగూరు), రెజ్లింగ్ గ్రేకోరోమన్ పురుషుల జట్టులో సీహెచ్. ప్రియతమ్ (న్యూసైన్స్ డిగ్రీ కాలేజి ,హనుమకొండ), కె.అఖిల్ (వాగ్దేవి డిగ్రీ కాలేజి హనుమకొండ), ఎస్‌డీ.ముబీన్ (యూఏఎస్‌సీ హనుమకొండ), జి.తిరుపతి, ఎస్.వినయ్‌కుమార్ (యూసీపీఈ కేయూ), ఎ.వినోద్ శ్రీకేవీఎస్ డిగ్రీ కాలేజి కురవి, మహబూబాబాద్) ఉన్నారు.

ఉమెన్ కేయూ జట్టు

కేయూ రెజ్లింగ్ మహిళల జట్టులో ఎస్.మహేశ్వరీ, కె.సంతోషి, ఇ.వెన్నెల, కె.రేణుక (ఐటీడబ్ల్యూ ఆర్‌డీసీ కొత్తగూడెం), షేక్ రెహానా (యూఏఎస్‌సీ హనుమకొండ), జె.మాధురి (కేవైఎస్ వరంగల్), కె.ఓంప్రశాంతి (టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ వరంగల్ వెస్ట్), పి.రమ్య (యూసీపీఈ కేయూ) ఉన్నారని శ్రీనివాస్‌రావు తెలిపారు. పురుషులు, మహిళల జట్లకు వరంగల్‌లోని బొల్లికుంట వాగ్దేవి ఫిజికల్ ఎడ్యూకేషన్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పి.లక్ష్మీపతి మేనేజర్‌గా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

హన్మకొండ అర్బన్ : ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొనేలా అధికారులు కృషి చేయాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరూ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని విధిగా ఉపయోగించుకోవాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్మోహన్‌రావు తీర్మానించారు. శనివారం హనుమకొండ ఐడీఓసీలోని టీజీఓ భవన్‌లో అసోసియేషన్ ఉమ్మడి జిల్లాల యూనిట్ల సంయుక్త కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొని గెజిటెడ్ అధికారుల సమస్యలపై చర్చించి, పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా టీజీఓ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దాసరి మురళీధర్‌రెడ్డి, అంజద్‌అలీ, హనుమకొండ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఫణికుమార్, ఈగ వెంకటేశ్వర్లు, నాగనారాయణ, కిరణ్‌కుమార్ గౌడ్, రాజేష్ కుమార్, కంచె వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం కన్నా రహస్య మంతనాలు మిన్న

కాజీపేట: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. డివిజన్ల వారీగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ఒకరిని మించి మరొకరు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. ప్రధాన నాయకులు, కుల సంఘాల పెద్దలు, మహిళా సంఘాలు, యువజన సంఘాల సభ్యులను ప్రసన్నం చేసుకునేందుకు రహస్యమంతనాలు చేస్తున్నారు. విజయానికి అవరోధంగా ఏ అంశాలు ఉన్నాయి. వాటిని ఎలా అధిగమించాలనే ఆలోచనలతో ప్రత్యేకంగా పార్టీల్లోని ముఖ్య నాయకులకు బాధ్యతలను అప్పగించి ముందుకెళ్తున్నారు. కార్మిక, వృత్తిదారుల సంఘాలను తమవైపు తిప్పుకోవడంలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం వారితో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. అవతలి పక్షం నుంచి నేతలు, కార్యకర్తలను రప్పించేందుకు అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. అదేసమయంలో ఉన్న వారిని కాపాడుకునేందుకు తిప్పలు పడాల్సిన పరిస్థితి. సభ్యుల సంఖ్యను బట్టి తాయిలాలు అందజేస్తున్నారు. ఉదాహరణకు ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ పాఠశాలల డ్రైవర్లు, భవన నిర్మాణ రంగ కార్మికులు ఇలా ఒక్కో వర్గం సంబంధిత సంఘాల్లో సభ్యులను గుర్తించి ప్రత్యేక ప్యాకేజీలను అందజేస్తున్నట్లు సమాచారం. మారిన రాజకీయ ట్రెండ్‌కు అనుగుణంగా వారికి కావాల్సిందే అప్పగిస్తున్నారని వినికిడి. నియోజకవర్గంలో రాజకీయ పార్టీల ప్రచారం కన్నా రహస్య మంతనాలే ఎక్కువగా కొనసాగుతున్నాయి.

స్కార్పియో- ఇసుక లారీ ఢీ

- ఛత్తీస్‌గఢ్‌వాసి మృతి
- వనదేవతలకు దర్శించుకొని వస్తుండగా ఘటన

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఎస్‌ఎస్‌తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని వెళ్తుండగా.. జరిగిన ప్రయాణంలో ఓ భక్తుడు మృతి చెందిన ఘటన శనివారం ఏటూరు నాగారం మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఆవుపల్లి గ్రామానికి చెందిన కారం సుమన్ (23) కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి శనివారం మేడారంలోని వనదేవతలను దర్శించుకున్నాడు. రాత్రి సమయంలో స్కార్పియో వాహనంలో మేడారం నుంచి ఛత్తీస్‌గఢ్ వెళ్తుండగా వాజేడు మండలం ధర్మారం నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న ఇసుక లారీ స్కార్పియోను ఢీకొట్టింది. అయితే సుమన్ మద్యం తాగి ఉండడంతో వాంతులు చేసుకునేందుకు వాహనం డోర్ నుంచి తల బయటపెట్టి ఉండడంతో లారీ ఆయను ఢీకొట్టడంతో చేయి నుజ్జునుజ్జు కాగా తలలోని మెదడు బయటపడింది. దీంతో సుమన్ మృతి చెందగా మిగతా 9 మంది క్షేమంగా బయటపడ్డారు. ఇసుక లారీలు అతివేగంగా రావడం వల్ల స్కార్పియో వాహనాన్ని ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణప్రసాద్ అక్కడకు చేరుకుని సుమన్ మృతదేహాన్ని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


స్కార్పియోను ఢీకొట్టిన లారీ

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి


మృతి చెందిన చీకట్ల బుచ్చయ్యగౌడ్

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు చీకట్ల బుచ్చయ్యగౌడ్ (50) ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వృత్తిలో భాగంగా కల్లు గీసేందుకు శనివారం ఉదయం తాటివనానికి వెళ్లిన బుచ్చయ్యగౌడ్ తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకు జారి కింద పడి మృతి చెందాడు. ఉదయం వెళ్లిన బుచ్చయ్యగౌడ్ మధ్యాహ్నం దాటినా ఇంటికి రాకపోవడంతో ఆయన ఎక్కే తాటి చెట్టు వద్దకు వెళ్లి చూడగా చెట్టు కింద పడి మృతి చెంది ఉన్నట్లు చెప్పారు. సమాచారం అందుకున్న ఎస్సై సీమా ఫర్హీన్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బుచ్చయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

ప్రచారానికి వెళ్లి వస్తూ..


వేణుగోపాల్(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ దూలం వేణుగోపాల్(45) అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి కోసం గ్రామంలో ప్రచారం చేసి గురువారం రాత్రి ఇంటికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన రోడ్డుపై ద్విచక్రవాహనం నడుపుతూ ఇంటికి వెళ్తున్న క్రమంలో అకస్మాత్తుగా కుక్కలు అడ్డు రావడంతో కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలై మెదడు దెబ్బతిందని, ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. కాగా, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డితోపాటు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్ పరామర్శించారు. వేణుగోపాల్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ పోలీసులు తెలిపారు.

గోదావరికి హారతి



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీమాసం పంచరత్నాల్లో భాగంగా వైకుంఠ చతుర్థశిని పురస్కరించుకొని గోదావరి నదికి పంచహారతి కార్యక్రమాన్ని ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గోదావరికి పాలు, పండ్లు, పసుపు, కుంకుమతో పాటు సారెను సమర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, అర్చకులు ప్రశాంత్‌శర్మ, బైకుంఠపాండా, సుబ్రమణ్యాశర్మ, రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.